క్లుప్తంగా

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి



పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధ టీకాలు వేయించి వారిని వ్యాధుల బారి నుంచి కాపాడాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం పాన్‌గల్ సబ్‌సెంటర్‌ను సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల నమోదు వివరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడంతో వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందుతారన్నారు. గర్భిణులకు మొదటి, రెండో డోస్ టీటీ వ్యాక్సిన్‌ను సరైన సమయంలో వేయించాలని ఆయన సిబ్బందికి సూచించారు. పౌష్టికాహారం, గర్భిణులు, తల్లుల, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేశ్వరి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి



పాన్‌గల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక చట్టం సాధన కోసం ఉద్యమిస్తామని ఎన్‌పీఆర్‌డీ సంస్థ మండల అధ్యక్షుడు బంగారయ్య అన్నారు. బుధవారం మండలంలోని గోప్లాపూర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్ పెంపునకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం తీసుకరావాలని ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఐకమత్యంతో పోరాడేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

'మద్యం తాగి వాహనాలు నడపొద్దు'



అమరచింత: మద్యం మత్తులో వాహనాలు నడిపి తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మండలంలోని కిష్టంపల్లిలో బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ గురించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనం నడిపే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోతూ లేదా తామే అదుపుతప్పి కింద పడిపోవడం వంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతున్నాయని వీటిని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పత్రాలు లేని వాహనాలపై ప్రయాణం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఆత్మకూర్: వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని జూరాల గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని డీపీఓ పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని, పన్నుల వసూళ్లను పూర్తి చేయాలని, తాగునీటి ఇబ్బందులు, పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

'అన్ని రంగాల్లో రాణించాలి'

ఆత్మకూర్: దళితులు రాజకీయ, వ్యాపార, విద్య తదితర రంగాల్లో రాణించాలని ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దళిత యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆత్మకూర్ మండల శిక్షణ తరగతులు ముగిశాయి. స్థానిక వర్తక సంఘం భవనంలో జరిగిన శిక్షణ తరగతుల్లో భారత రాజ్యాంగం, రాజకీయం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంజన్న, దానురాంనాయక్, సత్యం, కుర్మన్న, ప్రకాష్, నడిపి నర్సింహా, రాములు, శాంతన్న, దావీద్, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

భానుడి భగభగ.. 'ఉపాధి' విలవిల

- పని ప్రదేశాల్లో వసతులు కరువు
- రెండు నెలలుగా అందని కూలి డబ్బులు
- ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు

మండలాల వారీగా కూలి పెండింగ్..

మండలం	జీపీలు	ప్రస్తుతం కూలీలు	పెండింగ్ డబ్బులు
పాన్‌గల్	28	1173	29.46 లక్షలు
చిన్నంబావి	17	541	13.76 లక్షలు
వీపనగండ్ల	14	435	35.14 లక్షలు



పాన్‌గల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పాన్‌గల్: వలసలను నివారించి కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గతంలో పని ప్రదేశంలో తాగునీరు, కూలీలకు నీడ కోసం శామియానాలు, ప్రాథమిక చికిత్స కిట్ సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆయా సదుపాయాలు కరువయ్యాయి. దీంతో కూలీలు మండుటెండల్లో పని ప్రదేశాల్లో సౌకర్యాల లేమితో అవస్థలు పడాల్సి వస్తోంది. కూలీలు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పనులకు వెళ్తున్నారు. పని ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచకపోవడంతో కూలీలే నింటి నుంచి బాటిళ్లు తీసుకెళ్లాల్సి వస్తోంది. కానీ ఎండ కారణంగా వెంటనే నీరు వేడి ఎక్కుతుండడంతో కూలీలు ఆ నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు జనవరి నుంచి కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు వాపోతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



పని ప్రదేశంలో ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో గునపం, పారలు ఇచ్చేవారు. తాగునీటి సౌకర్యం, నీడ, ప్రాథమిక చికిత్స కిట్ వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.
– చంద్రకళ, ఉపాధి కూలీ, పాన్‌గల్

కూలి బకాయిలు చెల్లించాలి



ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు అందించే కూలి రెగ్యూలర్‌గా అందట్లేదు. జనవరి నుంచి కూలి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పాటు పనుల వద్ద వసతులు కూడా కల్పించాలి. అధికారులు స్పందించి పెండింగ్ కూలి డబ్బులు మంజూరు చేయాలి. – గాలెన్న, పాన్‌గల్

స్వీయ జాగ్రత్తలే కీలకం

- ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తగినంత నీరు తాగాలి. శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. పని ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీళ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం పని చేసేలా చూసుకోవాలి.
- పని మధ్యలో చిన్నచిన్న విరామం తీసుకోవాలి.
- తలనొప్పి, మైకం, వాంతులు, చెమట ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. బాధిత వ్యక్తిని నీడ ప్రదేశంలోకి చేర్చి నీటితో శరీరాన్ని తుడవాలి.
- ఉప్పు, చక్కెర కలిపిన ఆహారం లేదా పండ్లు తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి, లవణాలు నిల్వ ఉంటాయి.

తగిన చర్యలు..



పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పని ప్రదేశాల్లో అవసరమైన వసతులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించాం. మరోమారు సిబ్బందితో మాట్లాడి వసతుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటాం. మండలంలో కూలీలకు జనవరి నుంచి కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. మరోమారు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చూస్తాం.
– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

ఉపాధి కూలీలు జాగ్రత్తగా ఉండాలి



లక్ష్మీపల్లిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమణరావు

చిన్నంబావి: వేసవి కాలం కావడంతో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. ఆయన మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయం వేళలో త్వరగా పనులకు వచ్చి తొందరగా ఇంటికి వెళ్లాలని సూచించారు. అదేవిధంగా పని జరిగే ప్రదేశంలో తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లు, నీడకు టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎవరైనా ఎండతాపానికి గురయితే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని చెల్లపాడు నర్సరీని పరిశీలించారు. నర్సరీ యందు మొక్కల ఎదుగదలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎండ వేడిమికి తట్టుకునేలా గ్రీన్‌మ్యాట్లును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రామస్వామి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

గోపాల్‌పేట: బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి లక్ష్మమ్మ అన్నారు. బుధవారం ఆమె స్థానిక తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డితో కలిసి బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఎవరైనా బాల్యవివాహాలు జరిపించాలని చూస్తే వెంటనే 1098కి సమాచారం ఇవ్వాలని, ఆ తర్వాత వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా గృహహింసకు గురికావడం, బాలికలు అనారోగ్యం బారిన పడడం వంటి దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయన్నారు.

'పది' విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి'

చిన్నంబావి: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని మండలంలోని పెద్దదగడ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భాస్కర్‌యాదవ్ కోరారు. పరీక్షలు రాసే పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను ఆయన బుధవారం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన విద్యార్థులు మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధిస్తే రూ.పది వేలు, ద్వితీయ ర్యాంకు వస్తే రూ.5వేలు గ్రామ స్థాయిలో మొదటి ర్యాంకు వస్తే రూ.మూడు వేలు ప్రోత్సాహకంగా అందిస్తానని ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు పాఠశాల, గ్రామాభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. అనతంరం ఆయనను పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహ, బొల్లు శ్రీనివాసులు, పరశురాం యాదవ్, శంకర్ యాదవ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



పాన్‌గల్‌లో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

పాన్‌గల్: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి బుధవారం మండల కేంద్రంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు ఇప్పటి నుంచైనా ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. జీపీ సిబ్బంది వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని, గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, సిబ్బందిని రెగ్యూలరైజ్ చేయాలని, ఏడాదికి 3 జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల బీమా, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అరుణ్‌కుమార్, రవి, వెంకట్, వెంకట్రాములు, నర్సింహులు, రాందాసు, కుర్మయ్య, గోపాల్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి



డీఎంఆర్‌ఎం ఆస్పత్రి సమీపంలో నిలిచిన మురుగు చూపుతున్న సీపీఎం నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలోని 6, 7 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో సీపీఎం నాయకులు బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ డీఎంఆర్‌ఎం ఆస్పత్రి పక్కన డ్రెయినేజీ లేక మురుగు రహదారిపై పారుతుందన్నారు. ఎర్రగొల్లోల ఇంటి వెనకాల డ్రెయినేజీ లేక ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీరు గుంతలలో నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రహదారులతో పాటు డ్రెయినేజీలను యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు వార్డుల పర్యటన చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, అధికారులు నిర్లక్ష్యం వీడి వార్డుల్లో నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విష్ణు, కర్ణాకర్, చంటి, తిరుమలి శ్రీను, అంజి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేపట్టాల్సిందే..

ఆత్మకూర్: రాష్ట్రంలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ పూర్తయిన తర్వాతనే గ్రూప్– 1, గ్రూప్– 2, తదితర పోటీ పరీక్షల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గాంధీచౌక్‌లో మండల అధ్యక్షుడు దండు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో అజ్జపాగ లక్ష్మణ్, సోంబాబు, జానకిరాం, జహంగీర్, రామకృష్ణ, మాసన్న, కృష్ణ కుమార్, గాలిపంపుశ్రీను, కిషోర్, రాము, అనిల్, వెంకటన్న, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

ముస్సిపాలిటీ ఎదుట వీధి వ్యాపారుల ధర్నా



ధర్నా చేస్తున్న వీధి వ్యాపారులు

వనపర్తి రూరల్: పట్టణంలో రోడ్డు విస్తరణ కారణంగా డబ్బాలు తొలగించడంతో జీవనోపాధి కోల్పోయామని, వ్యాపారం చేసుకోవడానికి తమకు అడ్డా చూపించాలని బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులు మున్సిపాలిటీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణంలోని పాలిటెక్నిక్ కాంపౌండ్ ఆనుకొని గతంలో ఉన్న డబ్బాల్లో 40 ఏళ్ల నుంచి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బాలు తొలగించిన సమయంలో మూడు నెలల వ్యవధిలో మున్సిపల్ నుంచి ఎవరి స్థలంలో వారికి డబ్బాలు వేసి ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో 60 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ చూపి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వీధి వ్యాపారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరచారి, బాలస్వామి, గంధం గట్టయ్య, ఎల్ బీసన్న, నందిమల్ల రాములు, వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు బాలేసాబు, కార్యదర్శి రామస్వామి, నాయకులు చంద్రుడు, రవీందర్, నాగరాజు, సత్యం, రాములు, అదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ శివశంకర్

అమరచింత: ఆర్థిక అక్షరాస్యత గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్ అన్నారు. యూనియన్ బ్యాంకు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మస్తిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు, వివిధ రకాల లావాదేవీల గురించి వాటి ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ తమ కుటుంబ సభ్యులు బ్యాంకు లావాదేవీలను ఎలా వినియోగించుకుంటున్నారనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు బ్యాంకు మేనేజర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి కాల్వ మరమ్మతు చేపట్టాలి



మదనాపురం: ఏనుకుంట రిజర్వాయర్ ప్రధాన కాల్వ కింద సాగు చేసిన పంటలు సాగునీరు అందక ఎండిపోతున్నాయని, కాల్వకు మరమ్మతు పనులు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఏనుకుంట రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు అందించే కాల్వలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, కాల్వలో మట్టి పేరుకుపోవడంతో పాటు జమ్ము, కంపచెట్లు పెరిగి ఉండటంతో నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాల్వల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత పాలకులు అధికారులతో చర్చించి కాల్వల మరమ్మతుకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, గోపి, వెంకట్రాములు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

గోపాల్‌పేట: రెండో తరగతి చదివే విద్యార్థులు బొమ్మల ఆధారంగా ఇంగ్లిష్, తెలుగు భాషల్లో చెప్పడం ద్వారా వారు ఏ మేరకు అర్థం చేసుకుంటారోనని చేపట్టిన సామర్థ్యం పరీక్ష బుధవారంతో ముగిసింది. ముందుగా ఎంపిక చేసిన కేశంపేట కొత్తతండా పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు గణితంలో తార్కికంగా ఆలోచించడం ద్వారా సమాధానాలు రాబట్టడం, తెలుగు, ఇంగ్లిష్ భాషలో వినడం ద్వారా అర్థం చేసుకోవడం , అక్షరాలు గుర్తించడం, పదాలు చదవడం, రాయడం వంటి విషయాలను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ రవిశేఖర్ పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. విద్యార్థుల నుంచి పూర్తి సమాచారం తీసుకున్న అనంతరం భవిష్యత్‌లో విద్యార్థులకు బోధనాపద్ధతులు ఎలా ఉండాలనే విషయం తెలుస్తుందని ప్రధానోపాధ్యాయుడు రాంమూర్తి తెలిపారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ సర్పంచ్‌లు



మదనాపురంలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సర్పంచులు తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో ప్రభుత్వ ఆదేశం మేరకు వారిని ముందస్తు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతు తాము అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి 15 నెలలు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని వాపోయారు. చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వమంటే ఇలా ముందస్తు అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటరమణ, బాలాంజనేయులుగౌడ్, దేవేందర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మదనాపూరం: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులను బుధవారం మదనాపురం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టు చేసిన వారిలో రామన్‌పాడు మాజీ సర్పంచ్ కురుమూర్తి, దుప్పల్లి మాజీ సర్పంచ్ శివ, కోట్ల తిరుపతయ్య, టీకే కృష్ణ, రాజ్‌కుమార్ ఉన్నారు.

నైట్‌హాల్ట్ బస్సు ఏర్పాటుపై హర్షం

వీపనగండ్ల: జిల్లా కేంద్రం నుంచి వీపనగండ్లకు ఆర్టీసీ అధికారులు నైట్‌హాల్ట్ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కేంద్రం నుంచి చివరి బస్సు మధ్యాహ్నం 2 గంటలకే ఉండడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా డిపో మేనేజర్ వేణుగోపాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రెడ్డి స్పందించి.. వనపర్తి నుంచి ప్రతి రోజు రాత్రి 7.20 నిమిషాలకు బస్సు బయలుదేరి చందాపురం, చింతకుంట, మాందాపురం, రాయినిపల్లి, బుచ్చిరెడ్డిపల్లి, పుల్గర్‌చర్ల, కల్వరాల గ్రామాల మీదుగా వీపనగండ్లకు 8.30 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. ఆ బస్సు తెల్లవారుజామున తిరిగి 4.40 నిమిషాలకు వనపర్తికి బయలుదేరుతుందని వారు తెలిపారు.

సైన్స్ పోటీల్లో రాణిపేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్, విద్యాశాఖ అధికారులు

కొత్తకోట రూరల్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిస్వార్థ ఆర్గనైజేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ మేళాలో మండలంలోని రాయిణిపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మెహవిస్, జి.లాస్య ప్రదర్శించిన ఆటోమేటిక్ సెలైన్ అలారం సిస్టం అనే ప్రాజెక్ట్‌కు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి దక్కింది. ఇందుకు గానూ రూ.7,500 నగదును ఎస్పీ రావుల గిరిధర్ అందజేసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రతిభ కనబరచడానికి ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు మాధవి, ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసులును డీవైఎస్‌ఓ మహబూబ్‌నగర్ అధికారి కోట్యానాయక్, డీవైఎస్‌ఓ వనపర్తి అధికారి సుధీర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో నిస్వార్థ ఆర్గనైజేషన్ నిర్వాహకులు అరవింద్, రాజశేఖర్, మండల విద్యాధికారి కృష్ణయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, గ్రామస్తులు విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

'వికసిత్ భారత్'పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, లెక్చరర్లు

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్' ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ బి.ఈశ్వరయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ అంశాలపై విద్యార్థులు వీడియో తీసి తమ అభిప్రాయాలను ఈ పోర్టల్‌లో చర్చించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు కొంకల గట్టయ్య, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, పుష్ప, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటాచారి

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి గ్రామంలో మార్చి 31 నాటికి 100 శాతం ఇంటి పన్ను వసులు చేయాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు ఖచ్చితంగా వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలకు గురువారం నుంచి ట్యాంకర్ల ద్వారా నీళ్లు పట్టాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో టెంటు, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చేపట్టే పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ లక్ష్మి, ఈసీ సత్యం, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.